# సైకియాట్రిక్ కథలు



## ప్రేమ

మీనాకి ముప్పై అయిదు సంవత్సరాల వయస్సు. ఆమె ఒక పెద్ద హాస్పిటల్లో కాషియర్‌గా పనిచేస్తోంది. భర్తది టూరింగ్ జాబ్ కాబట్టి ఆమె ఒంటరితనం భరించలేక ఉద్యోగంలో చేరింది. ఆమెకు పిల్లలు లేరు.

అంతా సవ్యంగా సాగిపోతున్న సమయంలో మీనా మనస్సులో ఒక ఊహ అకస్మాత్తుగా తలెత్తింది. హాస్పిటల్లో కొత్తగా చేరిన ఒక డాక్టరు తనను ప్రేమిస్తున్నాడనీ, ఆ ప్రేమ చాలా గాఢమైనదనీ ఒక నమ్మకం ఆమెలో మొదలైంది. ఆమె డాక్టర్ని గాఢంగా ప్రేమించడం మొదలెట్టింది. డాక్టరు ఆమెతో మామూలుగా అన్న మాటలలో ఆమె ప్రేమపూరితమైన అర్థాలు వెతకడం మొదలెట్టింది. అతను పని ఉండి ఆమె దగ్గరకు వచ్చి మామూలుగా చూసినా, ఆ చూపులు ఆమెకు ప్రేమతో కూడినవిగా కనిపించేవి. అతని ప్రతి చేష్ట వెనుకా ఆమెకు ఏదో ఒక సైగ కన్పించేది. డాక్టరుకి అప్పటికే వివాహమైపోయి ఉండడం వల్లనే అతను తనతో మనసు విప్పి మాట్లాడడం లేదని ఆమె నిర్ణయించుకుంది.

ఈ ఊహలతో రెండేళ్ళు గడిచాయి. ఆమె మనస్సులోని ఊహా కెరటాలని తెలియని డాక్టరు ఆమెతో మామూలుగానే మాట్లాడుతున్నాడు. అతనిలో ఆమెపై ప్రేమ ఉంటే కదా పైకి చెప్పడానికి. తన మనస్సులోని సంక్షోభం భరించలేని మీనా ఉద్యోగానికి రిజైన్ చేసింది. ఇంట్లో కూచుని ఎప్పుడూ డాక్టరు గురించి తల్చుకుంటూ ఉండేది. అతను తనతో ప్రేమగా మాట్లాడినట్లు, తనను కౌగలించుకుని ముద్దాడినట్లు ఆమెలో ఊహాతరంగాలు సాగిపోయేవి. ఆమెకు పొత్తికడుపులో అస్తమానం తీవ్రమైన స్పందనలు కలిగేవి. అవి ఏమిటో తెలియక ఆమె చాలా భయపడేది. భయాన్ని తట్టుకోలేక ఆమె ఫామిలీ డాక్టరుని సంప్రదించింది. ఆమె మనస్సులోని సంక్షోభాన్ని గుర్తించిన ఫామిలీ డాక్టరు ఆమెను ఒక మగ సైకియాట్రిస్టు దగ్గరకు పంపించాడు. మగడాక్టరు దగ్గర మనస్సువిప్పి తన ప్రేమ గురించి మీనా చెప్పలేకపోయింది. అప్పుడామె ఒక ఆడ సైకియాట్రిస్టును కల్సుకునే ఏర్పాటు జరిగింది. లేడీ డాక్టరు దగ్గర తన మనస్సులో ఉన్న విషయాలన్నీ చెప్పుకుంది మీనా.



డాక్టరు మీనాని చిన్ననాటి విషయాలడిగింది. మీనా పుట్టడానికి ముందే ఆమె తండ్రి మరణించాడు. పుట్టెడు దుఃఖంలో ఉన్న మీనా తల్లి కూతుర్ని ఎక్కువగా పట్టించుకునేది కాదు. తప్పనిసరైన పరిస్థితులలో అత్తవారింటిలోనే ఉండిపోయిన మీనా తల్లిని పనిమనిషిలా చూసేవారు. మీనా పెద్దనాన్న పిల్లల విషయంలో చాలా స్ట్రిక్ట్‌గా ఉండేవాడు. చదువులో ఏమాత్రం తక్కువగా మార్కులొచ్చినా ఎక్కువగా శిక్షించేవాడు. మీనా అంతగా తెలివైన పిల్లకాదు. స్కూల్లో, ఇంట్లో దెబ్బలు తింటూ భయాందోళనల మధ్య పెరిగి పెద్దదైంది. మనుష్యుల మధ్య ఉంటే ఆమెకు భయం వేసి ఇన్‌సెక్యూర్‌గా ఫీలయ్యేది.

మీనాకి వివాహమైంది. ఆమె జీవితంలో అంతగా వలపు పండలేదు. పిల్లలు పుట్టలేదు. దాంపత్య జీవితం తక్కువైందని భర్త బాధపడితే, మీనా అతను తన నుంచి సుఖాన్ని అతిగా ఆశిస్తున్నాడనేది. వైవాహిక జీవితం ప్రారంభమయ్యాక మీనా నిద్రమాత్రలకు బానిసైంది.

అంతవరకూ మీనా జీవితం గురించి విన్న డాక్టరు ''మీప్రేమ కథ గురించి మీ భర్తకు చెప్పారా'' అని అడిగింది.

మీనా భయంతో ముఖం ముడుచుకుపోగా లేదని చెప్పింది.

డాక్టరుతో మాట్లాడినంతసేపూ మీనా చాలా ఆందోళనతోనే ఉంది. ఆమె నోటిలోనుంచి మాటలు కూడా అతికష్టం మీదనే వచ్చాయి. ఆమె చాలా తెలివైన వ్యక్తికాదు. ఆమె అభిప్రాయాలూ, అభిరుచులు కూడా సర్వ సామాన్యమైనవే. ఆమెలో ఉన్న ఏకైక లోపం ఒక డాక్టరు తనను గాఢంగా ప్రేమించి తనకే జీవితాన్ని అంకితం చేస్తున్నాడన్న భ్రాంతి. ఆ విషయంలో ఆమె మనస్సు మార్చడం చాలా కష్టం.

సైకియాట్రిస్టు కేసును బాగా పరిశీలించింది. మీనాతో ఆమెకు పెద్దగా పరిచయం కూడా లేని డాక్టరు ఆమెను గాఢంగా ప్రేమిస్తున్నాడన్న తప్పు ఊహ బలంగా పాతుకుపోయి ఉంది. ఆ ఊహ తప్పయినప్పటికీ, ఎప్పుడైనా ఎవరో ఒక డాక్టరు ఆమెను గాఢంగా ప్రేమించే అవకాశం మాత్రం లేకపోలేదు. మీనాలో ఇంకేరకమైన భ్రాంతులూ, మూడ్ అస్తమానం మారిపోవడాలూ, అవయవ లోపాలూ లేవు. కాబట్టి మీనా డెల్యూషనల్ డిసార్డర్‌తో బాధపడుతున్నట్లుగా డాక్టరు నిర్ణయించింది. ఎవరో ఒకరు తనను ప్రేమిస్తున్నట్లుగా తీవ్రంగా నమ్మడం వల్ల మీనా డెల్యూషనల్ డిసార్డర్ ఇరాటోమానిక్ టైపుది. సాధారణంగా తమకన్నా పైస్థాయిలో ఉన్నవారు తమని ప్రేమిస్తున్నట్లుగా ఈ డిసార్డర్ ఉన్నవారు భ్రాంతి చెందుతూ ఉంటారు.

మీనాకి ఆమెకున్న డిసార్డర్ గురించి సైకియాట్రిస్టు వివరించి చెప్పాక మీనా తనకు పొత్తికడుపులో వస్తున్న స్పందనల గురించి అడిగింది. డాక్టరు మీనా తన ఊహా ప్రియుడి గురించి తల్చుకుంటున్నప్పుడు ఆమెలో సెక్సు గురించిన భావనలు కలిగి, ఆ భావనలు శరీరంలో స్పందనలుగా మారతాయని చెప్పింది.

డాక్టరు మీనాను మందులివ్వనా అని అడిగితే మీనా వెంటనే ఒప్పుకుంది. డాక్టరు మీనాకు పిమోజైడ్ మందు ఇచ్చింది. దాంతో పాటు ఎవరో అంతగా పరిచయం లేని వ్యక్తిని ప్రేమించడంలోని అసంబద్ధతను వివరించి చెప్పింది.

మూడు, నాలుగు వారాలు మందులు వాడేక మీనాలో కొంత ప్రశాంతత ఏర్పడింది. ఒక డాక్టరు తనను ప్రేమిస్తున్నాడన్న భ్రాంతి కొంతవరకూ సడలిపోయింది. ఆమె వాడే నిద్రమాత్రల సంఖ్య తగ్గింది. ఆమె భ్రాంతి తగ్గుతున్న సమయంలో ఆమెకు డిప్రెషన్ వస్తే సైకియాట్రిస్ట్ ఆంటీ డిప్రెసంట్ ఇచ్చింది. కొంతకాలానికి మీనా పూర్తిగా మామూలు మనిషైంది.

మీనా నిద్రమాత్రలు మొత్తం మానేసింది. ఆమె ఇంకొక ఉద్యోగంలో ప్రవేశించింది. ఆమె సంసార జీవితం బాగుపడింది. ఆమె ఎప్పుడైనా ఒకసారి డాక్టర్ని తల్చుకుని, అతను తనని ప్రేమిస్తున్నాడా అని అనుకుంటుంది. కానీ ఆమెలో అతను తనని ప్రేమిస్తున్నాడన్న తీవ్రమైన ఊహాకెరటాలు మాత్రం పొంగి ప్రవహించవు. ఆమె మనస్సులో సంక్షోభం అసలు లేదు. చిన్నప్పుడు ప్రేమ తక్కువ కావడం వల్లనే తను భ్రాంతిలో పడ్డానా అని మీనా అప్పుడప్పుడు అనుకుంటుంది.

ఈ కేసులో మీనా ముప్పై అయిదేళ్ళ స్త్రీ. కానీ చాలామంది యవ్వనం ఆరంభమైన కొత్తలో ఇటువంటి భ్రాంతిలో పడుతూ ఉంటారు. తమకి ఇష్టమైన ప్రఖ్యాతులైన సినీతారలు, క్రికెటర్లు, రచయితలు లేదా తమకు పరిచయమున్న లెక్చరర్లు, పక్కింట్లో ఉండేవాళ్ళు, మిత్రులు తమని ప్రేమిస్తున్నారన్న భ్రాంతిలో పడి చదువునూ, ఇతర ముఖ్యమైన వ్యాపకాలనూ నెగ్లెక్ట్ చేస్తారు. దాంతో భవిష్యత్తు పాడైపోతుంది. ఒక్కొక్కసారి ఎవరైతే ప్రేమిస్తున్నారని టీనేజర్స్ భ్రాంతిలో పడతారో, వాళ్ళు భ్రాంతిలో పడ్డవారిని మోసం చెయ్యొచ్చుకూడా. అందుకే సరైన సమయంలో భ్రాంతిలో నుంచి బయటపడడం చాలా అవసరం.

ఊహలతో రెండేళ్ళు గడిచాయి. ఆమె మనస్సులోని ఊహా కెరటాలని తెలియని డాక్టరు ఆమెతో మామూలుగానే మాట్లాడుతున్నాడు. అతనిలో ఆమెపై ప్రేమ ఉంటే కదా పైకి చెప్పడానికి. తన మనస్సులోని సంక్షోభం భరించలేని మీనా ఉద్యోగానికి రిజైన్ చేసింది. ఇంట్లో కూచుని ఎప్పుడూ డాక్టరు గురించి తల్చుకుంటూ ఉండేది.

-పాలంకి సత్య

(డా.జి. ప్రసాదరావు, ఎండి గారి సలహాలతో)